సాక్షి తిరుపతి

గురువారం । 15 । జూన్ । 2023



సేద్యానికి సర్వం సరఫరా

ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు, విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. - 4లో



అశ్వని ఆస్పత్రిలో రక్తదానం

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అశ్వని ఆస్పత్రిలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. - 4లో



	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	28
చిత్తూరు	39	27
తిరుమల	36	24
గూడూరు	43	31
నగరి	42	29

న్యూస్‌రీల్


శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని 27 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 75,227 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 33,706 మంది తల నీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారికి హుండీ ద్వారా కానుకల రూపంలో రూ.3.85 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశం టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

వర్కింగ్ జర్నలిస్ట్‌లకు హెల్త్ స్కీమ్

తిరుపతి అర్బన్ : జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్ట్‌లకు హెల్త్‌స్కీమ్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అక్రిడిటేషన్ కార్డు పొందిన జర్నలిస్ట్‌లు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హెల్త్ స్కీమ్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేవలం రూ.1,250 ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం మరో రూ.1,250 చెల్లిస్తుందన్నారు. ఈ స్కీమ్ వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు వర్తిస్తుందని వెల్లడించారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్ట్‌లు ఒరిజినల్ చలానా, గతంలో జారీ చేసిన హెల్త్ కార్డు జిరాక్స్, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్‌లను కలెక్టరేట్‌లోని డీపీఆర్‌ఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్ట్‌లు వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులు ఏడాదిలో అనారోగ్యం బారిన పడిన ప్రతిసారీ రూ.2లక్షల విలువైన వైద్యసేవలు పొందే వెసులుబాటు ఉంటుందని వివరించారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) తరహాలోనే అన్ని సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ స్కీమ్‌లో చేరేందుకు ఎలాంటి ఆదాయ పరిమితుల లేవని, అక్రిడిటేషన్ కార్డు ఉన్న ప్రతి జర్నలిస్టు అర్హుడేనని వెల్లడించారు.

అమ్మకు హైబీపీ!



- చిత్తూరులోని గిరింపేటకు చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం రెండు నెలల క్రితం నగరంలోని జిల్లా ఆస్పత్రిలో చేరింది. ఆమెకు బీపీ ఉందని, కాన్పు కష్టమవుతుందని వైద్యులు సిజేరియన్ చేశారు. శిశువు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే తిరుపతి రుయాకు పంపించారు. అక్కడ చికిత్సపొందుతూ బిడ్డ రెండోరోజే మృతి చెందింది. ఆ వెంటనే తల్లి పరిస్థితి విషమంగా మారడంతో వేలూరు సీఎంసీకి తరలించారు. అక్కడ ఆమె కూడా వారం రోజులకు మరణించింది.
- తవణంపల్లెకు చెందిన కవిత (పేరు మార్చాం)కు ఆరునెలల క్రితం పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు హైబీపీ ఉండడంతో వైద్యులు హైరిస్క్ కేసుగా గుర్తించి సుఖ ప్రసవం కోసం ప్రయత్నించారు. కుదరకపోవడంతో సిజేరియన్ చేసేశారు. తల్లీబిడ్డ సురక్షితంగా ఇంటికి చేరుకున్నారు.

ఇవి మచ్చుకు రెండు మాత్రమే.. జిల్లాలో ఇలా హైబీపీ బారిన పడి పెద్దసంఖ్యలో గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి హైరిస్క్ కేసులను సకాలంలో గుర్తించకపోవడం వల్ల కొందరు ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. బీపీ మహమ్మారి తల్లులతోపాటు బిడ్డలను కబళించేస్తోంది. ప్రమాద ఘంటికలు మోగిస్తున్న హైబీపీ మరణాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ప్రెగ్నెన్సీ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే రిస్క్ తగ్గించుకోవచ్చని సూచిస్తోంది. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తోంది.

- అధిక రక్తపోటు బారిన పడుతున్న గర్భిణులు
- జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న హైరిస్క్ కేసులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- మరణాల కట్టడికి ప్రభుత్వం చర్యలు

చిత్తూరు రూరల్ : మహిళల్లో కొందరికి గర్భం దాల్చకముందు నుంచే హైబీపీ ఉంటుంది. మరికొందరిలో గర్భం దాల్చిన 20వ వారం తర్వాత ఇది కనిపిస్తోంది. ఒకవేళ 20వ వారం కంటే ముందే వారికి హైబీపీ ఉందంటే.. వాళ్లకు అంతకు ముందే రక్తపోటు ఉందని, గుర్తించలేదని అర్థం. హైబీపీ ఉన్న మహిళలు గర్భం దాల్చినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి. తగు సలహాలు తీసుకోవాలి. వైద్యులు సూచించిన మందులనే వాడుకోవాలి.

జెస్టేషనల్ హైబీపీ

గర్భిణుల్లో వచ్చే హైబీపీని జెస్టేషనల్ హైబీపీ అంటారు. గర్భం దాల్చిన 20వ వారంలో హైబీపీ కనిపిస్తే దాన్ని ప్రీ అక్లాంప్సియా అంటారు. వీరు ప్రసవమైన ఆరు వారాల తర్వాత మళ్లీ మామూలు స్థితికి వచ్చేస్తారు. అలాగే అక్లాంప్సియా సమస్య ఉన్నవారిలో అది ఫిట్స్‌కు దారితీయవచ్చు. ఇది చాలా తీవ్రమైన సమస్య. అందువల్ల ప్రీ–అక్లాంప్సియా దశలో ఉన్నప్పుడే చికిత్స తీసుకోవడం మంచిది. మహిళల్లో గర్భధారణకు, బీపీ పెరగడానికి సంబంధం ఉన్నట్లు వైద్య నిపుణుల పరిశీలనలో తేలింది. ప్లాసెంటా పెరుగుదలతో ఏర్పడే కొత్త రక్తనాళాలు అభివృద్ధి చెందడంతోనే సమస్య వస్తుందని నిపుణుల అభిప్రాయం.

చిత్తూరు జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి	సీహెచ్‌సీలు
1	8
ఏరియా ఆస్పత్రులు	**పీహెచ్‌సీలు**
4	50

ప్రసవ వివరాలు...

నెల	మొత్తం ప్రసవాల సంఖ్య	బీపీ కేసులు
జనవరి	2,548	215
ఫ్రిబవరి	1.985	184
మార్చి	2,891	282
ఏప్రిల్	2,671	146
మే	3,011	216

నష్టాలు ఇలా..

- ప్రీ–అక్లాంప్సియా సమస్య వల్ల కాబోయే తల్లికి పక్షవాతం రావచ్చు
- మూత్రపిండాలు, కాలేయ వ్యాధుల బారిన పడవచ్చు
- రక్తం గడ్డకట్టే అవకాశాలు ఉండవచ్చు
- బిడ్డ ఎదుగుదలలో సమస్య తలెత్తవచ్చు
- నెలలు నిండకముందే ప్రసవం, లేదా మృతశిశువు పుట్టే అవకాశం ఉంటుంది



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి జిల్లా సమాచారం

టీచింగ్ ఆస్పత్రులు	ఏరియా ఆస్పత్రులు
2	3
సీహెచ్‌సీలు	**పీహెచ్‌సీలు**
7	58

ప్రసవ వివరాలు...

నెల	మొత్తం ప్రసవాల సంఖ్య	బీపీ కేసులు
జనవరి	5,897	461
ఫ్రిబవరి	6.012	1428
మార్చి	5,241	289
ఏప్రిల్	5,819	354
మే	6,105	366

జాగ్రత్తలు ఇలా..

- గర్భం దాల్చిన వెంటనే ప్రభుత్వాస్పత్రి, హెల్త్ సెంటర్‌ను ఆశ్రయించాలి
- లేకుంటే ఏఎన్ఎం, ఆశవర్కర్లకు సమాచారం అందించాలి
- వారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునేలా చూస్తారు
- పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పిస్తారు
- బీపీ, మధుమేహం ఉంటే పర్యవేక్షణలో ఉంచుతారు
- బీపీ నిర్ధారణ అయితే హైరిస్క్ కేసుగా గుర్తిస్తారు
- ప్రసవ సమయంలో ఇంటి నుంచి ఆస్పత్రికి దగ్గరుండి తీసుకెళతారు

డాక్టర్‌ను సంప్రదించాలి

భరించలేనంత తలనొప్పి, కళ్లు సరిగా కనిపించకపోవడం, మసక బారినట్లుగా ఉండడం, పొట్టనొప్పి, వేవిళ్ల కాకుండా ఆ తర్వాత కూడా వాంతులు, కడుపులోని బిడ్డ కదలికలు సరిగా లేకపోవడం, గర్భం దాల్చిన కొంతమందిలో ముఖం ఉబ్బడం, కాళ్లు–చేతుల వాపు చాలా సాధారణం. అయితే ప్రీ–అక్లాంప్సియా ఉంటే అది పరిస్థితిని మరింత తీవ్రం చేస్తుంది. అలాంటి సమయంలో డాక్టరును తప్పక సంప్రదించాలి. ఇంట్లోనే వైద్యం అంటే కుదరదు. చాలా మంది గర్భిణి అని తెలిసినా వైద్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. అలా ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

– ఉషశ్రీ, గైనకాలజిస్ట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి



పుష్పపల్లకిపై చెంగాళమ్మ చిద్విలాసం


ఉత్సవాలకు హాజరైన భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి పల్లకిసేవతో ముగిశాయి. పుష్పపల్లకిపై కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పాలకమండలి ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పల్లకిసేవలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారు పగడాలు, ముత్యాలచీర అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు.

శుక్రవారం చాటు పొంగళ్లు.

చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు ముగియడంతో మొదటి శుక్రవారం చాటు పొంగళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలను కూడా విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన అధికారులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.



అడుగడుగునా నీరా'జనం'

- పాకాలలో మహాపాదయాత్రకు విశేష ఆదరణ
- గడప గడపలో మోహిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మోహిత్‌రెడ్డి

పాకాల : చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మహాపాదయాత్రకు ప్రజలు నీరాజనం పడుతున్నారు. బుధవారం పాకాల పంచాయతీలో ఆయన గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో సాగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని, అందుకే కాలర్ ఎగురవేస్తూ ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై జనం స్వచ్ఛందంగా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ఆయన వెంట నడుస్తున్నందుకు గర్వంగా ఉందని వెల్లడించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 175 స్థానాలను గెలుచుకుంటామనే ధీమా వచ్చిందన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి పాకాల మండలంలో అభివృద్ధి పనులకు మొత్తం రూ.40 కోట్లు వెచ్చించారని, అందులో ప్రతి పంచాయతీకి రూ.4 కోట్ల నుంచి రూ.5కోట్లు కేటాయించారని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడిగా తనను ఆశీర్వదించాలని కోరారు. పాదయాత్రలో భాగంగా మోహిత్‌రెడ్డి కమతంపల్లె, మెయిన్‌రోడ్డు, ధర్మరాజులగుడి వీధి, పాగతోట వీధి, చాకలి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్‌సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కమతంపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఆయన ముచ్చటించారు. చిరువ్యాపారులు, స్వయం ఉపాధి వృత్తిదారులతో మాట్లాడారు. తుడా మాజీ చైర్మన్ ఎల్‌బీ ప్రభాకర్‌నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్యం, యోగక్షేమాలను విచారించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం,, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజా బాబురెడ్డి, సర్పంచ్ కస్తూరి, పార్టీ మండల కన్వీ నర్ నంగా నరేష్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు మునీర్, లింగయ్య నాయుడు, డివిజన్ అధ్యక్షుడు కపిలేశ్వర్ రెడ్డి, పార్టీ టౌన్ అధ్యక్షుడు రమేష్, యూత్ ప్రెసిడెంట్, చంటి పాల్గొన్నారు.

జగన్ పార్టీ వాళ్లయితేనే రండి!

జగన్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) వాళ్లయితేనే మా ఇంటికి రండి..! లేదంటే రావద్దు..! ఆయనకు తప్ప నేను ఎవరికీ ఓటు వేయను.. అని పాకాల పార్కు వీధికి చెందిన నీలమ్మ తేల్చిచెప్పారు. గతంలో పింఛన్ కోసం నానా అవస్థలు పడేదాన్ని.. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటికి వచ్చి మరీ నాకు పెన్షన్ అందజేస్తున్నారు. మా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా పండగలకు చీర, స్వీట్లు పంపినాడు. కరోన సమయంలో అండగా నిలిచినాడు. మాస్కులు, కూరగాయలు నుంచి సరుకులు, పండ్లు, కోడి గుడ్లు, మందులు అన్నీ మా ఇంటికే పంపినాడు. నేను మళ్లీ ఆయనకే ఓటు వేస్తా అని స్పష్టం చేసింది. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా నీలమ్మ ఇంటికి వెళ్లినప్పుడు ఈ సన్నివేశం చోటుచేసుకుంది. వృద్ధురాలికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే చెవిరెడ్డిపై చూపిన అభిమానాన్ని గమనించి అందరూ ఆనందపడ్డారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడిగా రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని నీలమ్మకు చెప్పి ఆమె ఆశీస్సులు తీసుకున్నారు.


ఓటు వేస్తానంటూ మోహిత్‌రెడ్డికి మాట ఇస్తున్న వృద్ధురాలు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు : మండలంలో కీళపూడిలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జగనన్న తమ పిల్లల చదువు కోసం ఎంతో చేస్తున్నారని, ఆయన మేలును మరువలేమని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్నకు చెబుదాం ఫిర్యాదులకు ప్రాధాన్యం

- ఖరీఫ్ సీజన్‌కు ఎరువులు అందించండి
- 23వ తేదీన జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం
- కలెక్టర్ వెంకటరమణారెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో పీఆర్ కమిషనర్ సూర్యకుమారి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ , ఎస్పీ పరమేశ్వర రెడ్డి తదితరులు

తిరుపతి అర్బన్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు మరింత మెరుగ్గా పరిష్కారం చూపేందుకు వీలుగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో పలు సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, పంచాయితీ రాజ్ కమిషనర్ సూర్యకుమారి, జాయింట్ డీకే బాలాజీ , జిల్లా ఎస్‌పి పరమేశ్వర రెడ్డి , అడిషినల్ ఎస్పీ వెంకట్రావుతోపాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. సీఎం సమీక్ష అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించన మేరకు జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో భాగంగా అందిన ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈనెల 23న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టనున్నారని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని స్పష్టంచేశారు. ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనం సగటుకు తగ్గకుండా అందించాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మాణ పురోగతిని, అర్బన్ పరిధిలో కేటగిరీ 3 గృహాలు కాంట్రాక్టర్ వేగవంతం చేసేలా చూడాలని వెల్లడించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన నాణ్యతతో కూడిన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అశ్వని ఆస్పత్రిలో రక్తదాన శిబిరం


రక్తదాతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్లు

తిరుమల: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుమలలోని అశ్విని ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అశ్విని ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ ఎస్.కుసుమ కుమారి ఈ సందర్భంగా మాట్లాడుతూ 2004 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ''రక్తాన్ని ఇవ్వండి, ప్లాస్మా ఇవ్వండి, జీవితాన్ని పంచుకోండి'' అనేది ఈ సంవత్సరం నినాదమని ఆమె చెప్పారు. రక్తం అనేది ఒక వ్యక్తి మరొకరికి అందించగల అమూల్యమైన సహకారమని, ఒక జీవితాన్ని లేదా బహుళ జీవితాలను రక్షించడానికి రక్త దానం ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు. తిరుమల అశ్విని ఆస్పత్రిలో బుధవారం నాడు మొత్తం 24 మంది దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ పద్మజ, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ సుబ్బారెడ్డి, ఇతర పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి అభివృద్ధికి కృషి


ఆస్పత్రిలో వార్డులను పరిశీలిస్తున్న వైద్యశాఖ డైరెక్టర్ ఆంజనేయులు

తిరుపతి తుడా : తిరుపతిలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర బీమా వైద్యశాఖ డైరెక్టర్ వి.ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన నగరంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఓపీతోపాటు వివిధ వార్డులు, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. అందుతున్న వైద్యసేవలపై రోగులను ఆరా తీశారు. మందుల నిల్వలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని, ఎప్పటికప్పుడు మందులు కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని కోరారు. వైద్య పరికరాలు, ల్యాబ్, సర్జికల్ సామగ్రిని సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా ఆయనను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందించారు. హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ సిబ్బంది వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఈఎస్‌ఐ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్, ఆర్‌ఎంఓ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సేద్యానికి సర్వం సరఫరా


వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

తిరుపతి అర్బన్ : ఖరీఫ్ సీజన్‌లో సేద్యం చేస్తున్న రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు, కలెక్టరేట్ ఏడీఏ ధనంజయ రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 34,504 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ఎరువులు 42,900 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అంచనా వేసినట్లు వివరించారు. అందులో ఇప్పటి వరకు 41,151 మెట్రిక్ టన్నులను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 5వేల మెట్రిక్ టన్నులు వివిధ ఎరువులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అలాగే 16,063 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించినట్లు తెలిపారు. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా 472 సీహెచ్‌సీ గ్రూపులకు 40శాతం రాయితీలో వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. రైతు భరోసా పథకం కింద 1,76,981 మంది రైతులకు రూ.133.44 కోట్ల సాయం చేసినట్లు వెల్లడించారు.

శ్రీవారి సేవలో మంత్రులు


ఆలయం వెలుపల మంత్రులు వేణుగోపాలకృష్ణ, నాగార్జున

తిరుమల : తిరుమల శ్రీవారిని మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మేరుగ నాగార్జున బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

నీట్‌లో మెరిసిన తిరుపతి విద్యార్థి

- 700 మార్కులతో జాతీయస్థాయిలో 251వ ర్యాంక్


చక్రవర్తిని సత్కరిస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : నీట్ ఫలితాల్లో తిరుపతికి చెందిన విద్యార్థి జి.చక్రవర్తి సత్తా చాటారు. 720 మార్కులకు 700 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 251వ ర్యాంకు దక్కించుకున్నాడు. చక్రవర్తి తల్లి సుజాత తిరుపతి ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో డేలా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి డీపీటీఓ కార్యాలయంలో చక్రవర్తిని ఘనంగా సత్కరించారు. విద్యార్థి తల్లిదండ్రులు సుజాత, శ్రీనివాసులును అభినందించారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

తిరుపతి కల్చరల్: డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతుల్లో ప్రవేశాలకు ఎంపికలు చేపడుతున్నట్లు సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ తెలిపారు. 4వ తరగతిలో 40 సీట్లు చొప్పున 20 మంది బాలురు, 20 మంది బాలికలకు, 5వ తరగతిలో 11 చొప్పున ఏడుగురు బాలురు, నలుగురు బాలికలకు సీట్లు ఉన్నట్లు వెల్లడించారు. నాలుగో తరగతికి 8,9 ఏళ్ల మధ్య వారు అర్హులన్నారు. బాలబాలికలకు పిట్‌నెస్, ఎత్తు, బరువు పరీక్షలు, 30 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 10 మీటర్ల షటిల్ రన్, మెడిసన్ బాల్ పుట్, వర్టికల్ జంప్, 800 మీటర్ల పరుగు పందెం ఉంటుందని వివరించారు. ఆచార్య నాగార్జున వర్సిటీలో ఈనెల 15 నుంచి 20 వరకు మండలస్థాయిలో, 22 నుంచి 26 వరకు జిల్లా స్థాయిలో, 29 నుంచి 30 వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపికలు ఉంటాయని తెలిపారు. తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9542084270 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.